క్లుప్తంగా

ఆకట్టుకున్న సాహిత్యోత్సవ సభ



బహుమతులు అందుకున్న విజేతలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకృష్ణా పురం సాహిత్య మండలి, పుల్లాభొట్ల శ్రీరామ మూర్తి ప్రాంగణంలో ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి సంబరాలు, సాహిత్యోత్సవ కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. సంస్థ ఉపాధ్యక్షుడు కళా రత్న కేవీ సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించి విద్యార్థులకు సందేశాన్ని అందించారు. సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు కొలిపాక అరుణ యువతకు వివేకానంద జీవిత విశేషాలను, ఆయన యువతకు నిర్దేశించిన మార్గాన్ని వివరించారు. విశ్రాంత సాంఘిక శాఖ అధ్యక్షురాలు కోటమర్తి బ్రహ్మేశ్వరి సంక్రాంతి వైభవం గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో నాట్యాచార్య గండి కోట రాజేష్ శిష్యులు స్వాగత నృత్యం ప్రదర్శించారు. స్థానిక ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు కోలాటం, ఎక్కడి వారక్కడే ప్రబోధాత్మక లఘు నాటకం, మానవత సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులకు భోగిపళ్ల సంబరాలు ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి సభ్యులు కేకే స్వామి, లంకా వెంకటేశ్వర్లు, పెదపటి రామకృష్ణ, మజ్జి కాంతారావు నిర్వహించారు.

కాలు దువ్విన పందెం కోడి

- రాత్రి వేళ.. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో పందేలు
- కన్నెత్తి చూడని రెవెన్యూ, పోలీసు అధికారులు
- కోర్టు ఉత్తర్వులు సైతం బేఖాతరు



జాలిపూడిలో ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహిస్తున్న కోడి పందేలు



కోడి పందేల్లో జన సందోహం

ఏలూరు (టూటౌన్): సంక్రాంతి వేళ పందెం కోడి కాలు దువ్వింది. సంక్రాంతికి వారం, పది రోజుల ముందు నుంచి పోలీస్, రెవెన్యూ అధికారులు ఎన్ని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికినా ప్రజల్లో వారి హెచ్చరికల పట్ల ఇసుమంతైనా ఆలోచన రేపలేకపోయారు. ఇలానే చెబుతారు ఆ మూడు రోజులు యధావిధిగా లోపకాయిరిగా అనుమతులు ఇచ్చేస్తారంటూ తేలికగా తీసి పారేసిన పందెం రాయుళ్ల మాటలే మళ్లీ నిజమని రుజువయ్యాయి. సంక్రాంతికి వారం రోజుల ముందు నుంచి కోడి పందేల నిర్వాహకులు బరులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కంటి తుడుపు చర్యగా రెవెన్యూ పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు, బరుల ధ్వంసం, కోడి కత్తుల స్వాధీనం, కొన్ని బైండోవర్ కేసులు పెట్టడం వంటి చర్యలు చేశారు. తర్వాత వెనువెంటనే కోడి పందేల నిర్వాహకులు పెద్ద ఎత్తున తమ తమ ఏర్పాట్లలో నిమగ్నమవడం వంటి కార్యక్రమాలు చక చకా చేశారు. ఎవరెన్ని చెప్పినా సంక్రాంతి వేళ కోడి పందేలు, పేకాట ఆపడం సాధ్యం కాదనే నిర్వాహకుల మాటలే నిజమని తేలిందని సాధారణ ప్రజలు గుర్తు చేస్తున్నారు. దీంతో ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాలైన కొమడవోలు, చొదిమెళ్ల, శనివారపుపేట, పోణంగి, బూరాయిగూడెం వంటి ప్రాంతాల్లోనూ, ఏలూరు రూరల్ మండల పరిధిలో పలు గ్రామాల్లోనూ కోడి పందేలు, గుండాట, పేకాట జోరుగా నిర్వహించారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లోనూ కోడి పందేలు నిర్వహించారు.

హైకోర్టు ఆదేశాలు సైతం బేఖాతరు

సంక్రాంతి వేళ సంస్కృతీ, సాంప్రదాయం ముసుగులో ప్రతి ఏటా నిర్వహిస్తున్న కోడి పందేలను నిలువరించాలని, జూద క్రీడలను నిరోధించాలని కోరుతూ పలువురు కోర్టులను సైతం ఆశ్రయించారు. సామాజిక కార్యకర్త ఘంటసాల వెంకటలక్ష్మి దీనిపై హైకోర్టులో సైతం పిల్ వేశారు. ఆ పిల్ కాపీని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఇద్దరూ విడివిడిగా, కలిసి ప్రెస్‌మీట్‌లు పెట్టి కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. అధికారులు అలానే చెబుతారు మన పని మనం చేసుకు పోదాం అనే చందాన సంక్రాంతి వేళ కోడి పందేలు, జూదం యథేచ్ఛగా సాగిపోతున్నాయి. హైకోర్టు ఆదేశాలను సైతం భేఖాతరు చేశారనే విమర్శలు వస్తున్నాయి.

సంప్రదాయం ముసుగులో హింసా క్రీడలు



సంస్కృతీ, సాంప్రదాయం ముసుగులో కోడి పందేలను హింసా క్రీడగా మార్చడం దుర్మార్గం. ప్రివెన్స్ ఆఫ్ యానిమల్ క్రూయాలిటీ యాక్ట్ 1960 ప్రకారం జీవహింస చేయడం చట్ట రీత్యా నేరం. ప్రభుత్వం సంప్రదాయాలను గౌరవించడం అభినందనీయం. అదే ముసుగులో హింసా క్రీడలను ప్రోత్సహించడం బాధాకరం. నిర్వాహకులు, రాజకీయ నాయకులు సంక్రాంతి ముసుగులో వ్యాపారాన్ని నిర్వహించడం పరిపాటిగా మారిపోయింది. ఇటువంటి క్రీడలను నిర్వహించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏఐఏవైఎస్

కుటుంబాలు వీధిన పడుతున్నాయి



సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందేలు, జూద క్రీడల కారణంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి వీధిన పడుతున్నాయి. ప్రభుత్వాలు ఇటువంటి జూద, హింసాత్మక క్రీడలను అరికట్టాలి. వీటి స్థానంలో సంప్రదాయం క్రీడలు, ముగ్గుల పోటీలు వంటివి నిర్వహించాలి. ప్రధానంగా మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థికంగా చితికి పోతున్నారు. అప్పుల పాలు అవుతున్నారు. పచ్చని సంసారాల్లో జూద క్రీడలు, కోడి పందేలు వంటివి చిచ్చు రేపుతున్నాయి. –ఎ.రాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి, ఏలూరు

వైభవంగా గోదాదేవి కల్యాణం



వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని పలు వైష్ణవ ఆలయాల్లో సోమవారం గోదాదేవి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రామచంద్రరావుపేట శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీగోదాదేవి, రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ కల్యాణ మహోత్సవం నిర్వహించగా, కార్య నిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు కందుకూరి వేంకట విజయ్ కుమార్ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కళల అభివృద్ధికి వీరయ్య కృషి ఎనలేనిది



శలా కోటి వీరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసి ఆధునిక సమాజంలో ఆదరణ కోల్పోతున్న కళలను అభివృద్ధికి దివంగత శలా కోటి వీరయ్య కృషి ఎనలేనిదని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కర్ణ భక్తుల సేవా సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు శలా కోటీవీరయ్య విగ్రహం పెదవేగి మండలం దిబ్బగూడెం లక్ష్మీపురం అడ్డరోడ్డులోని వ్యవసాయ క్షేత్రంలో సోమవారం ఉదయం వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సకల కళాకారుల సంఘం ప్రతినిధులు ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ వీరయ్య సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాష్ట్ర వ్యాప్తంగా పలు కళలను, కళాకారులను ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. వీరయ్య విగ్రహం రూపొందించిన అంతర్జాతీయ మహిళా శిల్పి దేవికారాణి ఉడయార్‌ను వీరయ్య సతీమణి శలా రాజేశ్వరి, కుమార్తెలు ఉష, నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో వీరయ్య సోదరులు శలా రాజబాబు, శలా కృష్ణారావు, శలా మోహన్, సాయి, వంశీ, వరుణ్, మాధవ్, సకల కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దువ్వి రామారావు, కార్యదర్శి బళ్ళ శ్రీనివాస్, కోశాధికారి నాట్యాచార్య దువ్వి హేమసుందర్, తలంశెట్టి మాధవ రావు, కలిదిండి కృష్ణంరాజు, తోట సత్యనారాయణ, శ్రీహరి కోటి, తవ్వా నరసింహారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ ముక్కోటి పూజలు

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, అంబర్‌పేట, పోలసానిపల్లిలో సోమవారం భోగి పండుగ సందర్భంగా ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివ ముక్కోటి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి రోజున ఎంత ఫలితం ఉంటుందో అదే ఫలితాన్ని శివ ముక్కోటి నాడు ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం. గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో శివ ముక్కోటిని పురస్కరించుకుని ఆలయ పూజారి లంకా శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	00
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	04
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	01
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	03
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	04
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	01
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	02
ఏలూరు – తిరుపతి	16.00	4830	32
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	34
ఏలూరు–బీహెచ్‌ఈఎల్	21.50	98502	18

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	68
వంకాయలు (కాంతులు)	48	బీన్సచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	40–48	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	40	కంద	76
కాకర కాయలు	44	బీట్‌రూట్	48
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	52	పాలకూర	10
బంగాళదుంపలు	30–36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07
దోసకాయలు	30–36	పుదీనా	05
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

రైతుల ఇంట సిరుల పండుగ సంక్రాంతి



భోగి మంట

సంక్రాంతి పండుగ అంటే రైతుల ఇంట సిరుల పండుగ సార్వా పంట పూర్తయ్యి ధాన్యం ఇంటికి చేరిన తరువాత వచ్చే మొదటి పండుగ సంక్రాంతి. కావున ఈ పండుగను పల్లెల్లో ఘనంగా నిర్వహిస్తారు. అల్లుళ్లు, బంధువులు ఒక చోట చేరి ఆనందోత్సవాల నడుమ పండుగను చేసుకుంటారు. సంక్రాంతికి పిండి వంటలు, సంప్రదాయ కోడి పందేలు, హరిదాసుల పలకరింపులతో సాగు తుంది. దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా గ్రామ ద్వీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన భోగి సంబరాలు

–సాక్షి ఫొటో గ్రాఫర్ ఏలూరు



తులసికోట వద్ద మొక్కుతున్న చిన్నారులు



బొమ్మల కొలువ వద్ద యువతులు



రోకలి పట్టిన మహిళలు

సాహిత్య కళను ప్రోత్సహించాలి



కోరాడ నరసింహారావు పురస్కారం అందుకుంటున్న పార్వతీ రామచంద్రన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): భవిష్యత్ తరాలకు సాహిత్య, సంగీత, నాట్యకళా రంగాల వారసత్వాన్ని అందించి, ప్రోత్సహించాలని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా రచయితల సంఘం ఐదో వార్షికోత్సవం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలిలో నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏలూరుకు చెంది వివిధ రంగాల్లో కృషి చేసిన గత తరానికి చెందిన ప్రముఖుల పేరు మీదుగా నేటి తరంలో అదే రంగంలో కృషి చేస్తున్న ప్రముఖులకు పురస్కారాలు అందించడం తమ కార్యాచరణలో ఒక భాగమన్నారు. ముఖ్య అతిథి గురు సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లాడుతూ 250 ఏళ్ల క్రితమే ఏలూరు నగరంలో పుట్టిన కావలి బొర్రయ్య దక్షిణ భారతదేశంలోనే తొలి చరిత్రకారుడని, శాసనాలను మొట్ట మొదటిసారిగా అధ్యయనం చేసిన వాడు, జర్నలిజానికి ఆద్యుడిగా నిలిచాడన్నారు. విశిష్ట అతిథి ప్రముఖ సినీ గేయకవి రసరాజు మాట్లాడుతూ బొడ్డు బాపిరాజు అరుదైన పద్యకవి అని, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో పాటు సమానంగా రచనలు చేసిన వాడని అన్నారు. ఆయన రచనలు డిగ్రీ విద్యార్థులకు పాఠాలుగా ఉండేవని, ఉస్మానియా, ఆంధ్రా, తిరుపతి యూనివర్సిటీల్లో పరీక్షా పత్రాల బోర్డులో కీలకపాత్ర వహించిన గొప్ప కవి అన్నారు. తెలుగు అధ్యాపకులు సుంకర గోపాల్ మాట్లాడుతూ బుచ్చి బాబు రాసిన చివరికి మిగిలేది నవల తెలుగు సాహిత్యంలోనే చరిత్రను సృష్టించిందన్నారు. సినీ విజ్ఞాన విశారద ఎస్వీ రామారావు మాట్లాడారు. అనంతరం మణిమేల శివ శంకర్‌కు కావలి బొర్రయ్య స్మారక పురస్కారాన్ని, బుచ్చిబాబు స్మారక నవలా పురస్కారాన్ని కేఎన్ మల్లీశ్వరికి, బొడ్డు బాపిరాజు స్మారక పురస్కారాన్ని ఉపాధ్యాయుల రామారావుకి, పార్వతీ రామచంద్రన్‌కి కోరాడ నరసింహారావు స్మారక పురస్కారాన్ని అందించారు. కార్యక్రమంలో కేవీ సత్యనారాయణ, బీవీవీ ప్రసాద్, ముస్తఫా అలీ, వై.అర్జున్‌రావు, పెదపాటి రామకృష్ణ, మహ్మద్ ఖాజావలి, పుల్లాభొట్ల పురుషోత్తం, కొండా రవి పాల్గొన్నారు.

వీనుల విందు సంగీత విభావరి



అన్నమాచార్య కీర్తలను ఆలపిస్తున్న బిందు, సింధు సిస్టర్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం పది గంటల నుంచి స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఐదున్నర గంటలకు సుదర్శన ఆచార్య శ్రీగోదా దేవి వైశిష్ట్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. బీకే బిందు, బీకే సింధు సిస్టర్స్ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, శ్రీ గోదా కల్యాణ కీర్తనలు భక్తులకు వీనుల విందు చేశాయి. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్య నిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.